క్లుప్తంగా

రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం



విద్యార్థిని గాయత్రిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

గంట్యాడ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ హేమర్ త్రో పోటీల్లో మదనాపురం మోడల్ స్కూల్ విద్యార్థిని పి.గాయత్రి ద్వితీయ స్థానం సాధించింది. శ్రీకాకుళంలో ఈనెల 20, 21,22వ తేదీల్లో నిర్వహించిన అండర్–17 హేమర్ త్రో పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున గాయత్రి ప్రాతినిధ్యం వహించింది. విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రామ కృష్ణారావు, పీడీ రాధ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

గుర్ల: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూరీసర్వేతో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభించనుందని వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పాలవలసలో భూరీసర్వేను సర్వేయర్లతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. మండల సర్వేయర్ శివ, ఆర్‌ఐ అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ బూర్లె శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ వల్లూరి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న గ్రామ పెద్దలు

లక్కవరపుకోట: మండలంలోని రేగలో గ్రామదేవత చింతాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఎంపీటీసీ బొడ్డు గణపతి, సర్పంచ్ రావాడ నీలకంఠం ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన పప్పల చింతాలయ్య ఆర్థిక సహాయంతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


అయ్యరక సంఘం గౌరవ అధ్యక్షుడు మృతి



ఈశ్వరరావు (ఫైల్)

కొత్తవలస రూరల్: మండల అయ్యరక సంఘం గౌరవ అధ్యక్షుడు లెంక ఈశ్వరరావు సోమవారం ఉదయం మృతి చెందారు. మండలంలోని కొత్తసుంకరపాలెం గ్రామానికి చెందిన ఈయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతిపై ఆ సంఘం సభ్యులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

ముగ్గుల పోటీలు రేపు



పోటీల నిర్వహణపై సూచనలు చేస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

గజపతినగరం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 25న ముగ్గుల పోటీలు, అనంతరం ర్యాలీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.అరుణ కుమారి తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముగ్గుల పోటీలకు ఆసక్తి కలిగిన వారి పేర్లను సేకరించాలని సూచించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతుల ప్రధానం ఉంటుందని చెప్పారు. ర్యాలీని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఎలక్షన్ డీటీ తహసీల్దార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

బాలికల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిదీ

- నేడు జాతీయ బాలికా దినోత్సవం



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఎస్‌ఐ సన్యాసినాయుడు



వేపాడ: మోడల్ స్కూల్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరరావు



బొండపల్లి: మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో విద్యార్థినులు



చీపురుపల్లి: వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు



గజపతినగరం: వక్తృత్వ పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ విమలమ్మ

చీపురుపల్లి: బాలికల హక్కుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎస్‌ఐ ఏ.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికల హక్కులపై పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళల కోసం ప్రత్యేకంగా ఎన్నో చట్టాలు ఉన్నాయని, అంతేకాకుండా ఆడపిల్లలు చదువుకునేందుకు, ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన రిజర్వేషన్లు కూడా ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని చెప్పారు.పురుషులతో సమానంగా ప్రస్తుతం యాభై శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని దీని ద్వారా రాజకీయంగా, ఉద్యోగ పరంగా, పదవుల్లోను మహిళలకు సమాన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. బాల్య వివాహాలు నేరమని, మహిళలతో అనుచితంగా ప్రవర్తించినా, ఇబ్బందులు కలుగజేసిన వారిని శిక్షించేందుకు కఠిన చట్టాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడబిడ్డను కాపాడండి'

చీపురుపల్లి/ బొండపల్లి/ గజపతినగరం/ వేపాడ: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 'ఆడబిడ్డను కాపాడండి' అనే అంశంపై మండల స్థాయి వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చీపురుపల్లి విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వ్యాసరచన విభాగంలో కె.హారిక ప్రథమ, కె.మౌనిక ద్వితీయ, వక్తృత్వం విభాగంలో బి.అక్షయ ప్రథమ, కె.మల్లిక ద్వితీయ, చిత్రలేఖనం విభాగంలో కె.తేజశ్రీ ప్రథమ, బి.బిబీ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరిని డివిజన్ స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు మీసాల అప్పలనాయుడు, రౌతు రాములు వ్యవహరించారు.ఉపాధ్యాయులు మెండి జగన్నాథం, కంది నాగేశ్వరరావు, సీఆర్పీ కంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- బొండపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలకు 475 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ బూసినాయుడు తెలిపారు. వ్యాసరచనలో గరుడుబిల్లి హైస్కూల్ విద్యార్థిని చెందిన విద్యార్థిని కె.అలేఖ్య, చిత్రలేఖనంలో రాచకిండాం హైస్కూల్ విద్యార్థిని ఎం.స్పందన, వక్తృత్వంలో గరుడుబిల్లి హైస్కూల్ విద్యార్థి ఎం.భానుస్వాతిక ప్రథమ స్థానాల్లో నిలిచారు.
- గజపతినగరం ఎమ్మార్సీలో నిర్వహించిన పోటీలను ఎంఈఓ విమలమ్మ పర్యవేక్షించారు. మండల స్థాయి విజేతలను ఈనెల 25న బొబ్బిలిలో మున్సిపల్ గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న డివిజినల్ స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. సీఆర్పీలు రెడ్డి, శ్రీనివాస్, నారాయణరావు పాల్గొన్నారు.
- వేపాడ ఆదర్శపాఠశాలలో ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తులాహ్వానం

- ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

చీపురుపల్లి: పారా లీగల్ వలంటీర్లుగా పని చేసేందుకు ఆసక్తి కలిగిన, అర్హుల నుంచి మండల న్యాయ సేవా కేంద్రం ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.విజయరామేశ్వరి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులై పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు, అంగన్‌వాడీ టీచర్లు, డాక్టర్లు, లా విద్యార్థులు, ఎన్‌జీఓ సభ్యులు, స్వయం సహాయక సంఘ మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు జనవరి 31లోగా తమ బయోడేటాతో కూడిన వివరాలను మండల న్యాయ సేవా కేంద్రంలో సమర్పించాలని సూచించారు. అలాగే హైకోర్టు ఆదేశాల ప్రకారం ఫిబ్రవరి 11న స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను ఇరువర్గాల అంగీకారంతో సత్వర న్యాయం పొందవచ్చని వివరించారు. లోక్ అదాలత్‌కు హాజరయ్యే వారంతా మాస్కులు ధరించాలని సూచించారు.

భవిష్యత్ ప్రణాళికతో విద్యాభ్యాసం చేయాలి



దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికతో విద్యాభ్యాసం చేసినప్పుడే ఉన్నత భవిష్యత్ ఉంటుందని, లక్ష్యాల ను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని రెడాక్స్ లేబరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, ఎస్‌డీఎస్ కళాశాల పూర్వవిద్యార్థి దుర్గాప్రసాద్ అన్నారు. గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం కెమిస్ట్రీ విభాగం విద్యార్థులకు కెమికల్, ఫార్మా కంపెనీలో పని చేసేందుకు పట్టుసాధించాల్సిన అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి అవకాశాన్ని అనుకూలంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం ఆయన్ని కళాశాల అధ్యాపకులు సన్మానించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.కమలాకరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసన్నలక్ష్మి, ఎం.భాస్కరరావు, అడ్వయిజర్ బి.రవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత



ఎంపికైన విద్యార్థులతో శ్రీరామ్ కళాశాల అధ్యాపకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ రోప్ స్కిప్పింగ్, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22న విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–19 రోప్ స్కిప్పింగ్ పోటీల్లో సీహెచ్.విశాలాక్షి, ఎం.రోహిణి, బి.అఖిల్, వై.అభిరామ్, ఎస్.సురేష్, పి.సాయిరాం, ఫుట్‌బాల్ పోటీల్లో ఏ.ఎస్.భాగ్యశ్రీ, కె.వెంకటేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. భీమవరం, తిరుపతిలో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ టి.కమలాకరరావు, ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, అధ్యాపకులు బి.రవి, పీడీలు శ్రీనివాసరావు, భానుమూర్తి అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: గజపతినగరం టౌన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈ శివకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పు, కొత్త లైన్లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యాసరచన పోటీలు

దత్తిరాజేరు: ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటు హక్కు ఆవశ్యకత, వినియోగంపై స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ విద్యార్థినులకు తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థినులకు ఓటర్ల దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

సామూహిక కుంకుమ పూజలు



జామి: వాసవీమాత ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

జామి: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు సోమవారం కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు విన్నకోట సీతారామయ్య, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, సంఘం నేతలు ఐ.సుబ్బారావు, టి.సతీష్, ఐ.సతీష్, భీమసింగి,జాగరం వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాంభట్ల చంద్రశేఖరశర్మ, జాడ కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు వి.వి.ఎస్.ఎస్.ఎన్.గుప్త, సత్యారావు, వాసుదేవరావు, వెంకటరావు పాల్గొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: స్థానిక వాసవీ మెగా క్లబ్, వాసవి వనితా క్లబ్ సభ్యులు స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సోమవారం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేయించి ప్రసాద వితరణ చేశారు. ఆయా క్లబ్‌ల కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడి.. అధిక ఆదాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

గుర్ల: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సాధించగల చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏఓ ఎం.తిరుపతిరావు అన్నారు. చిరుధాన్యాల సాగుపై మండలంలోని గరికివలసలో రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో చిరు ధాన్యాలు పండుతాయని, బోడి, నువ్వులు, ఊదలు, కొర్ర, అండకొర్ర సాగు చేయాలని సూచించారు. అనంతరం సాగులో ఉన్న బోడి పంటను పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు భారతి, ప్రకాష్, జోత్మిరయి, వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు, వీపీఏ హరికృష్ణ పాల్గొన్నారు.

బీమా తక్షణ సహాయం

వేపాడ: జాకేరు గ్రామానికి చెందిన కాటపల్లి శ్రీను అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయంగా రూ.10 వేల నగదును సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు బుద్దా అప్పలనాయుడు తదితరులు సోమవారం అందజేశారు.

అగ్ని ప్రమాదం

వేపాడ: మండల కేంద్రంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో సోమవారం వంట గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు..ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో గ్యాస్ లీక్ అయ్యి మంటలు చెలరేగడంతో షాపులో ఉన్న వారంతా బయటకు పరుగులు తీశారు. వల్లంపూడి పోలీసులు ఎస్.కోట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి కె.గౌరీశ్వరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో షాపులో ఉన్న పాత్రలు,సామగ్రి కాలిపోయాయి.

సచివాలయంలో కలెక్టర్ తనిఖీలు



గంట్యాడ: పెదమజ్జిపాలెం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి



వేపాడ: వల్లంపూడి సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ పట్నాయక్

గంట్యాడ: మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామ సచివాలయంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, తదితర రికార్డులను పరిశీలించారు. సచివాలయం పరిధిలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని సిబ్బంది ని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలు, చిన్నారులకు వ్యాక్సినేషన్, ఆరోగ్య తనిఖీలపై ఆరా తీశారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వినియోగంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని, సచివాలయం వెలుపల బీఎల్‌ఓల ఫోన్ నంబర్లు, ఇతర వివరాలతో బోర్డు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆధార్ సేవలపై ఆరా..

వేపాడ: మండలంలో వల్లంపూడి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ కె.ఎస్.ఎన్.కె.పట్నాయక్, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ సోమవారం సందర్శించారు. సిబ్బంది హాజరు, మూమెంట్ రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం ద్వారా అందించిన సేవలు, పంచాయతీలో ఇంటిపన్ను వసూలు, ఆదాయం వ్యయం వివరాలపై పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందిని ఆరా తీశారు. అధికారుల వెంట వైస్ సర్పంచ్ రుద్ర వెంకటరావు ఉన్నారు.

పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎంపీపీ పీరుబండి హైమావతి మండల ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లు సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ కార్యదర్శులదేనని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జవాబుదారీతనం కొరవడిందని ఆరోపించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతీ దానికి జవాబుదారీతనం ఉందని, అందుకు అనుగుణంగా సచివాలయ సిబ్బంది పనిచేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇటీవల రైస్ కార్డుల మార్పులకు అవకాశం ఇచ్చిందని చెప్పారు. రైస్ కార్డులో మార్పులు లేక పోవడం వల్ల ప్రభుత్వ పథకాలు పొందలేకపోయిన వారి వివరాలను వలంటీర్ల ద్వారా సేకరించి వారికి పథకాలు వర్తించేలా చూడాలని సూచించారు. ఈ బాధ్యతను వలంటీర్లపై పూర్తిగా వదిలేయకుండా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కూడ బాధ్యత వహించాలని, పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా తెలుసుకోవడం కోసం గృహసారథులను ప్రభుత్వం నియమించిందని చెప్పారు. రైస్ కార్డులో చనిపోయిన వ్యక్తి వివరాలు తొలిగిస్తేనే అతని భార్యకు వితంతు పింఛను వస్తుందన్నారు. సచివాలయ ఉద్యోగులు అనధికారికంగా సెలవు పెడితే సహించేదిలేదన్నారు. మండలంలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చూడాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సూచించారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీడీఓ పి.భవాని, తహసీల్దార్ ప్రసన్న రాఘవ, ఈఓపీఆర్డీ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం, దుస్తుల పంపిణీ



గజపతినగరంలో నిర్వహించిన రక్తదాన శిబిరం

గజపతినగరం: లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ డాక్టర్ బి.ఎస్.ఆర్.మూర్తి తనయుడు డాక్టర్ నాగనరేంద్ర వర్థంతి సందర్భంగా గజపతినగరం శ్రీనివాస నర్సింగ్ హోమ్‌లో లయన్స్ క్లబ్, చైతన్య భారతి ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు రక్త దానం చేశారు. అలాగే విజయనగరం ప్రేమ సమాజం లో చిన్నారులకు భోజనాలు అందించారు. అలాగే 250 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాగనరేంద్ర భార్య లక్ష్మీ నరేస్, జెడ్పీటీసీ గార తవుడు,నాయకులు కర్ణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, గేదెల జగదీశ్వరరావు, వైద్యులు సతీష్ కుమార్, దుర్గాప్రసాద్, అనిల్ ప్రకాష్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



విచారణ నిర్వహిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

ఇళ్ల నిర్మాణాలపై విచారణ

కొత్తవలస రూరల్: మండలంలోని దెందేరు జగనన్న కాలనీలో పలువురు లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన స్థలం కంటే ఎక్కువ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని అందిన ఫిర్యాదుపై ఆర్డీఓ ఎం.సూర్యకళ సోమవారం విచారణ నిర్వహించారు. గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను ఆర్డీఓ పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన స్థలం దాటి ఎంతమంది లబ్ధిదారులు నిర్మాణాలు చేపడుతున్నారో కొలతలు వేసి పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే కాలనీ కోసం వేసిన రోడ్డులో జిరాయితీ భూమి ఎంత, కొంత మేర గెడ్డను కప్పి ఎందుకు రోడ్డు వేశారు, పనులకు సంబంధించిన బిల్లులపై ఆరా తీశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ పద్మజ, హౌసింగ్ ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో జీవితం నాశనం



మాట్లాడుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ ఆస్మ పర్వీన్

గజపతినగరం: యువత మద్యం, మత్తుపదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అడిషనల్ ఎస్పీ ఆస్మ పర్వీన్ సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై స్థానిక సాయిసిద్ధార్థ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దురలవాట్లకు దూరంగా ఉంటూ, చక్కగా చదువుకోవాలని సూచించారు. ఎస్ఈబీ సీఐ ఎం.విజయలక్ష్మి, ఎస్ఐ పి.అప్పారావు, బొండపల్లి ఎస్ఐ ఎస్.రవి, కళాశాల కరస్పాండెంట్ శీరం రెడ్డి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

దేశభక్తికి ప్రతిరూపం నేతాజీ



శృంగవరపుకోట: నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు



లక్కవరపుకోట: గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ శ్రీధర్, పాఠకులు



వేపాడ: సుభాస్ చంద్రబోస్ విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

శృంగవరపుకోట: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోష్ దేశభక్తికి ప్రతిరూపమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు అన్నారు. కళాశాలలో నేతాజీ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ముందుగా విద్యార్థులు, అధ్యాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు చేసి దేశస్వాతంత్య్రం కోసం కుటుంబాన్ని వదిలి, ఏళ్లపాటూ అజ్ఞాతంలో ఉండి, ఇతర దేశాల మద్దతు కూడగట్టి భారతీయుల్లో స్వాతంత్య్ర పిపాసను రగిల్చిన ధీరోధాత్తుడు అని అన్నారు. పలువురు అధ్యాపకులు నేతాజీ చేసిన సేవలను, జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.

సుభాష్ చంద్రబోస్ ఆదర్శప్రాయుడు

లక్కవరపుకోట: స్వాతంత్య్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోష్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి దామోదర్ శ్రీధర్ అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను గ్రంథాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర పోరాటంలో బోస్ పాత్రను పాఠకులకు వివరించారు.

వేపాడలో..

వేపాడ: మండల కేంద్రంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేపాడకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు షేక్ ఖాదర్ మొహిద్దీన్ కుమారుడు రెహమాన్ నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకలో మాజీ సర్పంచ్ గుమ్మడి భారతి,శానాపతి ఈశ్వరావు తదితరులు చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.